క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక పూజలు


ఫాతెహాలు సమర్పిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్టు ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివారెడ్డి గురువారం తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, కామర్స్, బాటనీ సబ్జెక్టులకు సంబంధించి పీజీలో 55శాతం ఉత్తీర్ణత సాధించిన వారు ఇందుకు అర్హులన్నారు. పీజీతో పాటు సెట్, నెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. ఆసక్తి గల వారు నవంబర్ 2వ తేదీన డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ 9866041775 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి కోసం పోరాటం

ఆదోనిరూరల్ : అసమానతలు లేని అభివృద్ధి కోసం పోరాడతామని, ఇందులో భాగంగా ఈనెల 30వ తేదీన ఆదోనిలో సీపీఎం ప్రజారక్షణభేరి రాష్ట్ర బస్సు యాత్ర చేపడుతున్నామని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాధాకృష్ణ, సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని కల్లుబావిలో ఆటో ప్రచార జాతా ప్రాంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పిన పాలకులు నేటికీ హామీలను అమలుచేయలేదని గుర్తు చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ తనిఖీ

మంత్రాలయం : మండలంలోని మాధవరం గ్రామం సమీపంలో నెలకొల్పిన మారుతి ఉక్కు పరిశ్రమను జిల్లా లేబర్ డిప్యూటీ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. ఈ నెల 13న పరిశ్రమ నిర్వహణపై నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ విచారణ చేపట్టారు. కార్మికుల, ఉద్యోగులతో సమయానికి మించి పనులు చేయిస్తున్నారని, ఫ్యాక్టరీ చుట్టూ బండలకు నష్టం వాటిల్లితోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు, ఉద్యోగులు, కంపెనీ జనరల్ మేనేజర్‌తో డిప్యూటీ కమిషనర్ వివరాలు సేకరించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అమ్రేష్, తాలుకా నాయకుడు దేవపుత్ర, చార్లెస్, రామరాజు ఉన్నారు.

ఘనంగా మహబూబ్ సుభాని గంధోత్సవం

కౌతాళం: మండలంలో మహబూబ్ సుభాని ఉరుసు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి గంధోత్సవం వైభవంగా జరిగింది. మండల కేంద్రంలో మహబూబ్ సుభాని దర్గా నుంచి రాత్రి 8 గంటలకు ప్రారంభమైన గంధం ఊరేగింపు 10గంటల వరకు సాగింది. శుక్రవారం ఉరుసు ఉంటుందని నిర్వహకులు తెలిపారు. ఉరుసు సందర్భంగా ప్రత్యేక ఖవ్వాలి పోటీలను నిర్వహిస్తారు. కౌతాళంతో పాటు కుంటనహల్, ఉప్పరహల్, రౌడూరు, హాల్వి, నదిచాగి, చిరుతపల్లి, సూళేకేరి, బాపురం, ఎరిగేరి, చూడి గ్రామాల్లో గంధం వేడుకలు ఘనంగా జరిగాయి.

పాఠశాలల పరిశీలన

కోసిగి: స్థానిక జెడ్‌పీ, ఎస్‌డబ్ల్యూ, కుమ్మరి వీధి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంఈఓ–2 నాగేశప్ప గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన పథకం అమలు పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. బీసీ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఎల్లార్తి షేక్ షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలతో పాటు రాత్రి నిద్రి చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో కూడా భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేసి చక్కరను నైవేద్యంగా సమర్పించారు. హొళగుంద సాయిబాబా ఆలయంలో కూడా భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. సాయి సేవక్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజారోగ్యానికి జగనన్న భరోసా

ఆదోనిటౌన్ : ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 35వ వార్డు అమరావతినగర్ మున్సిపల్ పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు హర్షిక, శంకర్, విష్ణువర్ధన్, దివ్యప్రసాద్, మానస, కీర్తి, సాయికుమార్ చెరో శిబిరంలో ఉంటూ ప్రజలకు వైద్యసేవలను అందించారు. ముందుగా ప్రజలు తమపేర్లను నమోదు చేయించుకొని డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఈసీజీ, ఆయాసం, వైరల్ ఫీవర్ తదితర వాటికి సంబంధించిన పరీక్షలను చేయించుకొని ఉచితంగా మందులు పొందారు. 400 మంది ప్రజలు శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వార్డు ఇన్‌చార్జ్ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

మంత్రాలయం : మండలంలోని మాధవరం తండా గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 212 మందికి వైద్య పరీక్షలు చేశారు. 27 మందికి కంటి పరీక్షలు, 15 మంది గర్భిణులు, 18 మంది చిన్నారులు, విద్యార్థులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి వెలుగు పథకం ద్వారా 20 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణిమంజరి, వైద్యులు భావన, వసంత, గీతా,సరయూ రెడ్డి రోగులకు చికిత్సలు అందించారు.

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో



ఈసీజీ పరీక్షలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, వైద్యులు, రక్త, బీపీ పరీక్షల కోసం గుమిగూడిన మహిళలు

పేదల ఆరోగ్యానికి రక్షణ లభించిందని చూడి గ్రామ సర్పంచ్ లక్ష్మి, ఇన్‌చార్జ్ ఉప్పళప్ప పేర్కొన్నారు. మండలంలోని చూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చూడి, కరణి, తిప్పలదొడ్డి ప్రజలు పాల్గొన్నారు. అనంతరం పలువురికి ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. డాక్టర్లు శిరీష, సుజాత, సరిత, నాయకులు గోవిందు, హంపయ్య పాల్గొన్నారు.

కోసిగి: మండలంలోని వందగల్లు గ్రామ సచివాలయం పరిధిలో వందగల్లు, నేలకోసిగి గ్రామ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేశారు. గురువారం వందగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు కాల్వ లక్ష్మయ్య ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్‌కుమా 345 మందికి వైద్య సేవలు అందించారు. వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ అరూన్ రషీద్, పంచాయతీ కార్యదర్శి వినోద్ నాయక్, ఎంపీహెచ్‌ఈఓ ఎల్లప్ప, శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ కృపానందం పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుందని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని జాలిమంచి గ్రామంలో సర్పంచ్ జి.తిక్కమ్మ, ఎంపీటీసీ సరోజమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు నిసిగ్రేస్, వై.శేఖర్, మహేష్ పాల్గొని 400 మందికి పైగా రోగులను పరీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను అధికారులు పరిశీలించారు. అనంతరం కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, గజేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ హేమలత, నాగరత్నమ్మ, ఏఎన్‌ఎంలు ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ పాల్గొన్నారు.


వందగల్లులో శిబిరానికి హాజరైన ప్రజలు

నేటి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్

ఆదోని సెంట్రల్: ఈనెల 27వ తేదీన ఆదోని మంత్రాలయం నియోజకవర్గాల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల వివరాలను గురువారం అధికారులు వెల్లడించారు. వివరాలు..

మండలం	గ్రామం	ప్రదేశం
ఆదోని	పెద్ద హరివాణం	2 సచివాలయం
కోసిగి	చిరుతనకల్లు	ప్రాథమిక పాఠశాల
కౌతాళం	ఉరుకుంద	సచివాలయం


షుగర్ పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు


రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్టును అందజేస్తున్న వైద్యులు

ముస్లిం మైనార్టీల కల సాకారం చేశాం

మంత్రాలయం/పెద్దకడబూరు : ఎన్నో ఏళ్లుగా పెద్దకడబూరు మండల కేంద్రంలోని ముస్లిం మైనార్టీలు షాదీఖానా భవనం కోసం ఎదురు చూశారని, తమ ప్రభుత్వ హయాంలో వారి కల సాకారమైందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. పెద్దకడబూరులో సీఎండీఎఫ్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ షాదీఖానా భవనాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న షాదీఖానాను పూర్తి చేశామని గుర్తుచేశారు. సామాజిక సాధికారతలో భాగంగా ప్రతి సామాజిక వర్గ ప్రగతికి తమ ప్రభుత్వం బాటలు వేసిందన్నారు. సంక్షేమ పథకాల అమలుతోపాటు కార్పొరేషన్ల ద్వారా సామాజిక వర్గాలకు మేలు చేస్తోందని చెప్పారు. ప్రతి సామాజిక వర్గం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తికరంగా ఉందన్నారు. టీడీపీ నేతలకు ఇది మింగుడు పడటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ముత్తమ్మ, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురామ్, సర్పంచు రామాంజనేయులు, నాయకులు రవిచంద్రారెడ్డి, గజేంద్రరెడ్డి, ముస్లిం మైనార్టీ సంఘం పెద్దలు పాల్గొన్నారు.


పెద్దకడబూరులో షాదీఖానా శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

చిరుత పట్ల అప్రమత్తంగా ఉండాలి


కోసిగిలో చిరుత సంచరించిన ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ శివశంకర్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రంలోని ప్రజలు చిరుత పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్ఓ) శివశంకర్ రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక తిమ్మప్ప కొండ చుట్టూ చిరుత సంచరించిన ప్రాంతాలను పరిశీలించి వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చిరుతలు ఒకే చోటు స్థిరంగా ఉండవని, కొండను ఆనుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్ల ముందు రాత్రిల్లో మేకలు, గొర్రెలు, కుక్కలు వంటి వాటిని ఉంచొద్దని చెప్పారు. చిన్న పిల్లలు బయట తిరగరాదన్నారు. కొండల్లోకి బహిర్భూమికి వెళ్లొద్దన్నారు. ఆహారం దొరకక పోతే అవే వెళ్లి పోతాయన్నారు. కొండల్లో చిరుతలు ఎన్ని ఉన్నాయని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. త్వరలో ప్రభుత్వ అనుమతితో బోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఆదోని డివిజన్ పరిధిలోని కోసిగి, ఆస్పరి, ఎమ్మిగనూరు, ఆదోని పరిసరాల్లో కొండల చుట్టూ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు 5 టీంలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైల్డ్ ఎఫ్ స్వచ్ఛంద సంస్థ కార్యకర్త శ్రీధర్, ఆదోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి, సెక్షన్ ఆఫీసర్ మణిధర్ నాయుడు, బీట్ ఆఫీసర్ అనురాధ ఉన్నారు.

కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తాం

కౌతాళం: మండలంలోని కూలీలు వేరే ప్రాంతాలకు వలసలు పోకుండా ఉన్న గ్రామాల్లోనే ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డ్వామా పీడీ అమరనాథరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలసల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని, ముఖ్యంగా ఉపాధి కూలీలు వలసలు పోకుండా నవంబరు 1నుంచి మండలంలోని ప్రతి గ్రామంలో 50 మంది కూలీలు తగ్గకుండా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని రైతులకు బోర్ల కింద పండ్ల తోటలపై అవగాహన కల్పిస్తామని తక్కువ పెట్టుబడితో మునగ పంట సాగుపై అవగాహన కల్పిస్తామన్నారు. వర్షభావం కారణంగా నీటి నిల్వ కోసం ఫాంపాండ్‌ల తవ్వకాలు చేపడతామన్నారు. సర్పంచ్ పాల్‌దినకరన్, ఏపీడీ లోకేశ్వర్, ఎంపీడీఓ సుబ్బరాజు, ఏపీఓ జుబేర్ అహ్మద్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథ రెడ్డి

యువత క్రీడల్లో రాణించాలి


మల్లికార్జునను అభినందిస్తున్న పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదిగాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సూచించారు. మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన మల్లికార్జున సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో 5 కి.మీ. పరుగు పందెంలో మొదటి స్థానం నిలిచాడు. విద్యార్థి వైఎస్సార్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. స్కూల్ తరఫున ఈనెల 14, 15, 16వ తేదీల్లో వరంగల్ జిల్లాలో జరిగిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో 5 కి.మీ. పరుగు పందెం పాల్గొని 25.43 నిమిషాల్లో గమ్యం చేరుకుని ప్రథమ స్థానం నిలిచాడు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడతో కలిసి విద్యార్థి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డిని కలిశారు. విద్యార్థిని అభినందించి రూ.5వేలు నగదు ప్రోత్సాహం అందించారు. ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, కోసిగయ్య, నరసింహులుగౌడ ఉన్నారు.

పౌరసరఫరాల గోడౌన్ తనిఖీ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక పౌరసరఫరాల గోడౌన్‌ను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న నిత్యావసర సరుకులను, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడౌన్ నుంచి ప్రజలకు అందించే నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. లారీలకు సంచులను ఎత్తేప్పుడు తుకాలను సరిచూసుకోవాలన్నారు. బియ్యం, బ్యాళ్లు, ఇతర సరుకులను జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. గో డౌన్‌లో ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.


గో డౌన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

28న ఆలయాల మూసివేత

దేవనకొండ : ఈనెల 28వ తేదీన చంద్రగ్రహణం ఉండడంతో మండలంలోని కౌలుట్ల చెన్నకేశవస్వామి ఆలయం, గద్దెరాళ్ల మారెమ్మవ్వ ఆలయాలను మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న సాయంత్రం 4 నుంచి 29వ తేదీన ఉదయం 6 గంటల వరకు ఆలయాలను మూసివేస్తున్నామని చెప్పారు.

- పెద్దకడబూరు సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
- ప్రగతి నివేదికలు సమర్పించని అధికారులపై చర్యలకు ఆదేశం

పార్టీలకు అతీతంగా సంక్షేమం

మంత్రాలయం/పెద్దకడబూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దకడబూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. మన బడి, నాడు–నేడు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంతో పంచాయతీల్లో ప్రగతి సౌధాలు వెలిశాయన్నారు. ప్రజల వద్దకు పాలన తెచ్చి పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. పెద్దకడబూరు మండల ప్రగతి కోసం శాయాశక్తుల కృషి చేస్తున్నామన్నారు. ప్యాకేజీలో ఉన్న ఎమ్మిగనూరు–కోసిగి, పెద్దకడబూరు–ఆదోని రోడ్లను రద్దు చేయిస్తామని, ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. జల జీవన్ మిషన్ పనులు త్వరతగతినా పూర్తి చేసి తాగునీరు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దకడబూరు ఆసుపత్రికి 108 అంబులెన్స్ తీసుకొచ్చిన ఘనత తమకే దక్కిందన్నారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వైద్య శాఖ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశానికి అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదోని డివిజనల్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్‌కు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు పెంచాలని ఇటీవల సీఎం దృష్టికి తీసుకెళ్లామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ సచివాలయానికి రూ.20 లక్షలు పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ముత్తమ్మ, ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దార్ వీరేంద్రగౌడ్, ఈఓపీఆర్‌డీ జనార్దన్, వైద్యాధికారిణి శాంతి జ్యోతి, ఎంఈఓ సునీలియం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, సర్పంచ్ రామాంజనేయులు, ఎస్ఐ మహేష్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

పరామర్శ

మంత్రాలయం : పెద్దకడబూరు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు అనుమంతరెడ్డి కొన్ని రోజులుగా వయోభారం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. డాక్టర్ దశరథరెడ్డితో మాట్లాడి ఆయన ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని కుమారుడు రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డికి సూచించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్ : మండలంలోని సుల్తాన్‌పురం గ్రామానికి చెందిన బాలు అనే వ్యక్తి విష రసాయనం సేవించి గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న బాలును బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యాత్యకు యత్నించాడని వైద్య సిబ్బంది తెలిపారు.

28న కూర్మక్షేత్రంలో ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్ : ఆస్పరి మండలం హలిగేర గ్రామ పరిధిలో వెలిసిన నల్లగుట్ట శ్రీహరి కూర్మక్షేత్రంలో ఈనెల 28వ తేదీన చంద్రగ్రహణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్ తెలిపారు. గురువారం స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. చంద్రగ్రహణ సమయంలో క్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గిరి ప్రదక్షిణ ఉంటుందని చెప్పారు. అనంతరం స్వామివారి గీతాలను రాసి కూర్మ నారాయణస్వామికి అంకితం చేసిన గేయ రచయిత మధురకవి ఎలమర్తి రమణయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాపరెడ్డి, వీహెచ్‌పీ నాయకులు భీంరెడ్డి, కాలురాం పురోహిత్, రాధారెడ్డి, అరుణ, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ రవిశంకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, బీజేవైఎం నాయకులు శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ స్వాముల ఆదేశాల మేరకు శనివారం చంద్ర గ్రహణశాంతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు గొరవయ్యల ఆటలు... దేవదాసీల క్రీడలు

హొళగుంద: మండలంలోని దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి సన్నిధానంలో శుక్రవారం గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. దేవరగట్టు దసరా బన్ని ఉత్సవంలో రెండో ప్రధాన ఘట్టమైన గొరవయ్యల ఆటలను చూడడానికి రాష్ట్ర నలమూలాల నుంచే కాకా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గొరువయ్యలు, గురుగొరవయ్యలు, పిల్లగొరవయ్యల నృత్యాలు, బళ్లారుకు చెందిన గొరవయ్య గొలుసు తెంపడం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. సాయంత్రం దేవదాసీలు చేసే నృత్యాలు, అనంతరం వసంతోత్సవం, కార్యక్రమాలు జరగనున్నాయి. అనంతరం కంకణ విసర్జనలో భాగంగా మాళమల్లేశ్వరస్వామి విగ్రహాలు, పల్లకీ ఆలయానికి చేరుతాయి. అక్కడి నుంచి శనివారం విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నాం

కౌతాళం : అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి లబ్ధి పొందేలా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కామవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు యువజన నాయకుడు మహేందర్‌రెడ్డి, కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు వీరసేనరెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిన తీరు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ ఎన్ని కుట్రలు చేసినా, పాదయాత్రలు చేసినా ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. తప్పు చేసినట్లు ఆధారాలు ఉండటంతోనే చంద్రబాబును రిమాండ్‌కు పంపారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. సర్పంచ్ వసంత, ఎంపీటీసీ గంగప్ప, పార్టీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కార్యదర్శి శివప్ప పాల్గొన్నారు.


వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

ప్రతి ఎకరాకు నీరు

- జగనన్న పాలనలో 3.42 లక్షల ఎకరాలకు సాగు నీరు
- టీడీపీ హయంలో 2.08 లక్షల ఎకరాలకే పరిమితం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: ప్రతి ఎకరాకు ప్రభుత్వం సాగు నీరందిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి, నాయకులు ఉప్పరహాల్ ఏకాంబర్ రెడ్డి, బంటకుంట సర్పంచ్ గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని ఎక్కడా పంటలు ఎండిపోలేదన్నారు. టీడీపీ నాయకుడు తిక్కారెడ్డి నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని ధర్నాలు చేయడం శోచనీయమన్నారు. పొదలకుంట గ్రామంలో బండ పక్కన నీళ్ల అందక 15 సెంట్లలో పైరు ఎండిపోతే దానిని చూసి పంట ఎండి పోయిందని చెప్పడం, గురువారం కామవరం ఎల్‌ఎల్‌సీ హెడ్‌రెగ్యులేటర్ వద్ద నిరసన చేయడం సరికాదన్నారు. 2018లో టీడీపీ హయాంలో ఇలాంటి పరిస్థితి వచ్చిందని, నాడు ప్రతి పక్షంలో ఉన్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వేలాది మంది రైతులతో కలిసి కాలువ మీదుగా తుంగభద్ర డ్యాం వరకు వెళ్లి అక్కడి అధికారులతో మాట్లాడి సాగు నీరు వచ్చేలా చేశారని గుర్తు చేశారు. 2014నుంచి 2019వరకు తుంగభద్ర దిగువ కాలువ కింద ఐదేళ్లలో 2.08లక్షల ఎకరాలకు సాగు నీరివ్వగా, జగనన్న పాలనలో 2019నుంచి ఇప్పటి వరకు 3.42 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. ఈ వివరాలు తాము సొంతంగా చెప్పడం లేదని, జాయింట్ అజామాయిషీ కమిటీ ఇచ్చిన రిపోర్టు అని చెప్పారు. అలాగే సంవత్సరాల వారీగా నీటి వినియోగాన్ని వివరించారు. 2019-20లో డ్యాం నుంచి 20టీఎంసీల నీళ్ల వాడుకుని 82 వేల ఎకరాలకు సాగు నీరు అందాయని, 2020–21లో 18.5 టీఎంసీలకు గాను 74వేల ఎకరాలకు, 2021–22లో 23 టీఎంసీలు నీరు వాడుకుని ఏకంగా 84వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత తమ పార్టీకి దక్కిందన్నారు. డ్యాం చరిత్రలో ఇంత నీరు అందించిన ఘనత ఎప్పుడూ లేదన్నారు. అలాగే 2022–23లో డ్యాం నుంచి 17 టీఎంసీల నీరు వాడుకుని 77వేల ఎకరాలకు సాగునీరు అందించామని, ప్రస్తుతం ఇప్పటి (26–10–2023) వరకు 6.2 టీఎంసీలు నీరు వాడుకుని 24.2 వేల ఎకరాలకు నీటిని అందజేశామని, ఇంకా పంట పొలాలకు నీరు అందుతుందని వివరించారు. నవంబర్1న నియోజకవర్గంలోని అన్ని గ్రామల రైతులు, రైతు సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే తమకు సూచనలు చేశారని తెలిపారు. తమ గ్రామంలో పంట పొలాలు బాగా ఉన్నాయని రైతు చాగి హనుమంతు తన పొలాన్ని చూపించారు. సమావేశంలో సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఎంపీటీసీ మూకన్న, నాయకులు వడ్డెరాము, శివరాం, మల్లయ్య, చెన్నప్రధని, సమద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


తన పొలం పచ్చగా ఉందని చెబుతున్న రైతు చాగి హనుమంతు